ఏవోల బాధ్యతల స్వీకరణ

బోనకల్లు నూతన ఏవో వినయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఏఈవోలు, రైతులు

బోనకల్లు/మధిర రూరల్, నవంబర్12: బోనకల్లు, మధిర, ఎర్రుపాలెం మండలాలకు నూతనంగా నియమితులైన మండల వ్యవసాయ అధికారులు (ఏవో) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బోనకల్లు ఏవోగా పసునూరి వినయ్‌కుమార్‌ను, మధిర ఏవోగా కే.సాయిదీక్షిత్‌ను, ఎర్రుపాలెం ఏవోగా బోయినపల్లి సాయిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు మంగళవారం వారు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో ఏఈవోలు, రైతులు కలిసి నూతన ఏవోలకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు: ఎస్సై

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సంధ్య

మధిర, నవంబర్ 12: అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని మధిర పట్టణ ఎస్సై సంధ్య స్పష్టం చేశారు. పట్టణంలోని అంబారుపేట ట్యాంకుబండ్‌పై స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టారు. మధిర టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద నిఘా పెట్టినట్లు చెప్పారు.

'సీపీఐది వందేళ్ల పోరాట చరిత్ర'

బోనకల్లు, నవంబర్ 12: ప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడిన తమ పార్టీది వందేళ్ల చరిత్ర అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఆ పార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా మండలంలోని రాపల్లె గ్రామంలో మంగళవారం జరిగిన సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు నల్లమల్ల సత్యనారాయణ, చింతపట్ల గోపయ్యలు సీపీఐ బలోపేతంలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. సీపీఐ నాయకులు తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, ఏనుగు గాంధీ, ఏనుగు రామకృష్ణ, ఏనుగు రవికుమార్, కొంగర రామారావు, ఏనుగు వేణు, మడుపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు చర్యలు

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హాజరైన అధికారులు, ఉద్యోగులు, వివిధవర్గాల ప్రజలు

మామిళ్లగూడెం, నవంబర్ 12: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్, అట్రాసిటీ సమస్యలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో చైర్మన్ వెంకటయ్య కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, రాంబాబునాయక్‌తో కలిసి పాల్గొన్నారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ పెండింగ్ భూ సమస్యల కేసులను నెలరోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు ఉంటారని, అక్కడ మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతినెల చివరి వారంలో ప్రజలకు సివిల్ రైట్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వసతిగృహాలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల ద్వారా అందిస్తున్న విద్యా సంబంధ కార్యక్రమాలను వివరించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టును పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, అదనపు డీసీపీ నరేష్‌కుమార్, ఎస్సీ అభివృద్ధిశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, జిల్లా అధికారులు, ఏసీపీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటల అవశేషాల దహనం చేయొద్దు..

రైతులతో మాట్లాడుతున్న ఏవో వాణి

కూసుమంచి, నవంబర్ 12: పంటల అవశేషాల దహనంతో భూసారానికి నష్టమని ఏవో రామడుగు వాణి అన్నారు. రైతులు వరి పంట కోసిన తరువాత దాని అవశేషాలను కాల్చివేస్తున్నారని అన్నారు. అలా చేయడం వల్ల భూమిలోని మిత్ర పురుగులు చనిపోతాయని వివరించారు. అందుకని అవశేషాలను కాల్చివేయకుండా కలియదున్ని నీరు పెడితే ఎరువులా మారుతుందని అన్నారు. మండలంలోని మల్లాయిగూడెంలో మంగళవారం పర్యటించిన ఆమె.. వరి కోతల అనంతరం దాని అవశేషాలను దహనం చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులు చదువుపైనే శ్రద్ధ పెట్టాలి: ఎస్సై

మాట్లాడుతున్న ఎస్సై రాజారాం

కారేపల్లి, నవంబర్ 12: తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలనే లక్ష్యంతో విద్యార్థులు చదువుపైనే దృష్టిసారించాలని కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం సూచించారు. మత్తు వంటి చెడు వ్యసనాలకు బానిస కావద్దని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేకదినం సందర్భంగా కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయకుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు సుధారాణి, తమ్మిశెట్టి శ్రీనివాస్, వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి: ఎస్సై

కూసుమంచి కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

కూసుమంచి, నవంబర్ 12: విద్యార్థినులు మంచిగా చదువుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కూసుమంచి ఎస్సై నాగరాజు ఆకాంక్షించారు. విద్యే మనిషిని, ముఖ్యంగా మహిళలను ఉన్నత స్థానంలో ఉంచుతుందని గుర్తుచేశారు. ముఖ్యంగా బాలికలు చదువుకుంటే ఆ ఇల్లు మరిన్ని వెలుగులు పంచుతుందని అన్నారు. కూసుమంచిలోని కేజీబీవీని మంగళవారం సందర్శించిన ఆయన.. బాలికల పట్ల నేటి సమాజంలో జరుగుతున్న అంశాలపై అవగాహన కల్పించారు. విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని, అందుకని ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్ అజితకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ అమలులో ప్రభుత్వం విఫలం: సీపీఎం

వైరా టౌన్, నవంబర్ 12: ఆరు గ్యారెంటీ హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నాయకులు నున్నా నాగేశ్వరరావు, మాచర్ల భారతి విమర్శించారు. వైరాలో మంగళవారం జరిగిన సీపీఎం వైరా పట్టణ 15వ మహాసభలో వారు మాట్లాడారు. అనంతరం వైరా పట్టణ కార్యదర్శిగా చలపతిరావు, 16 మంది కమిటీని ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత: సీపీఎం

ఎర్రుపాలెం, నవంబర్ 12: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు అన్నారు. ఎర్రుపాలెంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో మంగళవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్, గామాసు జోగయ్య, సద్గుర్తి సంజీవరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, షేక్ లాలా, తిరుపతిరావు, నాగుల్‌మీరా, దూదిగం బసవయ్య, ఇమేలమ్మ, కోటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'అయ్యప్ప దీక్ష స్వాములకు అన్నప్రసాద వితరణ'

అన్నప్రసాద వితరణను పారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, నవంబర్ 12: మధిర అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్ష స్వాములకు మాలధారణ స్వామి బత్తుల శ్రీను ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వంకాయలపాటి నాగేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుదర్శన్ కుటుంబానికి పరామర్శ


సుదర్శన్‌ను పరామర్శిస్తున్న తాతా మధు

ఖమ్మం, నవంబర్ 12 : ఖమ్మం నగరంలోని ప్రముఖ వైద్యుడు పాటిబండ్ల సుదర్శన్‌రావు తల్లి రాణిప్రమీల ఈ నెల 3వ తేదీన మృతిచెందగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ మంగళవారం పరామర్శించారు. వారి గృహానికి వెళ్లి రాణిప్రమీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తాతా మధుతోపాటు బీఆర్ఎస్ ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి: ఎమ్మెల్యే

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి టౌన్, నవంబర్ 12: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి.. వైద్యాధికారులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని, రికార్డులను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వారికి వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ సుజలా రాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కర్నవల్లి విద్యార్థి

సత్తుపల్లి (తల్లాడ), నవంబర్ 12: తల్లాడ మండలం కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బీ.నవీన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లాలో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఝాన్సీరాణి మంగళవారం తెలిపారు. ఖమ్మం పటేల్ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల ఎంపికల్లో నవీన్‌రెడ్డి ఎంపికైనట్లు చెప్పారు. మెదక్ జిల్లా చేగుంటలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో ఈ విద్యార్థి ఆడనున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం ఝాన్సీరాణి, ఫిజికల్ డైరెక్టర్ శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

24న వన భోజనాలు

మాట్లాడుతున్న కమ్మ మహాజన సంఘ నాయకులు

ఖమ్మం, నవంబర్ 12: ఖమ్మం కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన వెలుగుమట్ల ఫారెస్ట్ పార్కులో నిర్వహించే వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమ్మ మహాజన సంఘం నాయకులు, కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వెలుగుమట్ల ఫారెస్ట్ ఫార్క్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ నాయకులు వేజెడ్ల సురేష్, రావూరి సైదబాబు,గుడవర్తి నాగేశ్వరరావు, జట్ల శ్రీను తదితరులు మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా వనభోజనాలను ఏర్పాటు చేస్తున్నామని, కమ్మ కులస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మిక్కిలినేని నరేందర్, సంక్రాంతి నాగేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, చంద్ర రాంబాబు, గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాతృవియోగం

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైరా రూరల్, నవంబర్ 12: మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఓర్సు నర్సింహారావు తల్లి గురువమ్మ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ తదితరులు.. వెంటనే నర్సింహారావుకు ఫోన్ చేసి పరామర్శించారు. సానుభూతి వ్యక్తం చేశారు. భౌతికకాయం వద్ద నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, కట్టా కృష్ణార్జున్‌రావు, ముళ్లపాటి సీతారాములు, కామినేని శ్రీనివాసరావు, గుజ్జర్లపూడి దేవరాజు, అప్పం సురేశ్, షేక్ లాల్ మహ్మద్, ఐనాల కనకరత్నం, పెరుములపల్లి వెంకయ్య, షేక్ సైదా, పాలిమట్ల సీతారాములు, కేశవరావు, డేవిడ్ తదితరులు ఉన్నారు.

కారేపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా పబ్లిక్ టాయిలెట్లు

కారేపల్లి పబ్లిక్ టాయిలెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కారేపల్లి, నవంబర్ 12: మాదారం డోల మైట్ మెన్స్ సీఎస్ ఆర్ నిధులతో కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన ప్రజా మరుగు దొడ్లు ఎట్టకేలకు ఉపయోగంలోకి రానున్నాయి. పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా ఉండడంతో గ్రామస్తులు ఇటీవల వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఎంపీడీవో సురేందర్, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్‌లతో మాట్లాడారు. డోలమైట్స్‌మైన్స్ అధికారులతో చర్చించి ఆ టాయిలెట్ల వినియోగానికి వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో అవి మళ్లీ వినియోగంలోకి రానున్నాయి. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ బుధవారం వీటిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

'బాలికా విద్యతోనే చైతన్యవంతమైన సమాజం'

కొణిజర్ల, నవంబర్ 12: బాలికా విద్యతోనే చైతన్యవంతమైన సమాజం సిద్ధిస్తుందని స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల బాధ్యులు పేర్కొన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులందరూ చదువు గొప్పదనాన్ని తెలుసుకొని అందులో రాణించాలని సూచించారు. అనంతరం న్యూమోనియాపై నిర్వహించిన సదస్సులో లైఫ్‌సైన్స్ డైట్‌మెంట్ కే.రజిని, డాక్టర్ షేక్ జీనత్‌షాహిన్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.శ్రీవాణీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో 4,763 ఇళ్ల సర్వే

కూసుమంచి, నవంబర్ 12: కూసుమంచి మండలంలో మంగళవారం నాటికి 4,367 ఇళ్లలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సర్వే కోసం ఇంటికి ఎన్యూమరేటర్లు వచ్చిన సమయంలో తగిన పత్రాలు అందించి సహకరించాలని సూచించారు. చాలామంది సరైన ప్రతాలు ఇవ్వడం లేదని, కొంత మంది ఇళ్ల వద్ద ఉండడం లేదని అన్నారు. సర్వేకు వచ్చే విషయాన్ని ముందుగానే చెబుతున్నందున పత్రాలన్నీ సిద్ధం చేసుకొని పూర్తి వివరాలు అందించాలని సూచించారు. కాగా, మంగళవారం ఒక్కరోజే 1,386 ఇళ్ల సర్వేను పూర్తి చేసినట్లు చెప్పారు.

'నేటి నుంచి మహిళల కబడ్డీ పోటీలు'

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 12: కార్తీక పౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఆహ్వాన సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో తెలంగాణ, ఏపీ నుంచి మహిళా జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి 40 వేలు, మూడో బహుమతి 30 వేలు, నాలుగో బహుమతి 25 వేలు, ఐదో బహుమతి 20 వేలు, ఆరో 15 వేలు, ఏడో బహుమతి 10 వేలు, ఎనిమిదో బహుమతి 5 వేల చొప్పున ఇవ్వనున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

వైరా రూరల్, నవంబర్ 12: విద్యుదాఘాతంతో ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన వైరా మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని గరికపాడు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మాతంగి గోపయ్య, సువార్తలు మంగళవారం తమ ఇంట్లో భోజనం వండుకుంటుంగా విద్యుదాఘాతం కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో గోపయ్య ఇంట్లో నుంచి బయటకు వస్తూ ప్రమాదవశాత్తూ కింద పడి గాయాల పాలయ్యాడు. స్థానికులు మంటలు అదుపు చేశారు. గిర్దావర్ వెంకటేశ్వర్లు పంచానామా నిర్వహించారు. రూ.లక్షన్నర ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు తెలియజేయండి

మామిళ్లగూడెం, నవంబర్ 12: జిల్లాలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్‌ఫ్రీ నెంబర్ ముద్రిస్తున్నామని, 24 గంటలూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

వాలీబాల్ జట్టుకు న్యూవిజన్ విద్యార్థి

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 12: జిల్లాస్థాయి పాఠశాల క్రీడల అండర్-14 వాలీబాల్ బాలుర జట్టులో నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థి ఎం.సాయి అక్షయ్‌కుమార్ జిల్లా జట్టులో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్ తెలిపారు. ఈ నెల 16 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ చుంచు గోపాలకృష్ణ ప్రసాద్, డైరెక్టర్ సీహెచ్ గోపిచంద్, ప్రిన్సిపాల్ అభినందించారు.

విచారణ జరిపించాలి

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఐ రామకృష్ణ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

గురువమ్మ మృతి పట్ల సంతాపం

ఖమ్మం,నవంబర్ 12: వైరా మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన గొల్లపూడి మాజీ ఉప సర్పంచ్ ఓర్సు నర్సింహారావు మాతృమూర్తి గురువమ్మ మృతి పట్ల ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. గురువమ్మ మృతి వార్తను బీఆర్ఎస్ వైరా రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు ఫోన్ ద్వారా నామాకు తెలియజేయగా, ఆమె కుమారుడితో నామా ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి గురువమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

సుబ్లేడు పీహెచ్‌సీలో అధికారుల తనిఖీలు

తిరుమలాయపాలెం, నవంబర్ 12: మండలంలోని సుబ్లేడు పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనేషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చందూనాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వివిధ రకాల వైద్య ఆరోగ్య పథకాల అమలుతీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

డీపీఎస్‌లో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

క్రీడల పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీపీఎస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 12: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. కమాండ్ ఆఫీసర్ సంజయ్‌కుమార్ భద్ర, స్కూల్ చైర్మన్ కడారి రవీందర్‌రెడ్డి క్రీడల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి తోడ్పడతాయని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. మూడురోజులపాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబాకస్‌లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 12: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు యూసీ మాస్ అబాకస్ పోటీల్లో గ్రూప్ చాంపియన్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి తెలిపారు. పాఠశాల నుంచి 46మంది పాల్గొన్నారని, నగదు బహుమతులు, రన్నరప్, మెరిట్ సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ అభినందించారు.

ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక...

నగరంలోని ఎస్‌బీఐటీ అటానమస్ కళాశాలకు చెందిన విద్యార్థులు జెస్సాక్ట్ సంస్థ నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎంపికైన 36మందిని కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, నవంబర్ 12: వయసు దాటిపోతున్నా తనకు వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం రూరల మండలంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట మండలం కోదాడ మండలం త్రిపురాం గ్రామానికి చెందిన షేక్ మీరా (40) ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్ గ్రామంలో ఉంటున్నాడు. పదేళ్ల క్రితం అతడి తల్లితండ్రులు చనిపోవడంతో అప్పటి నుంచి ఖమ్మం రూరల్ మండలంలో తన చెల్లి జంగిటి అనూష వద్ద ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మీరాకు నత్తి ఉండడం వల్ల సరిగ్గా మాట్లాడేవాడు కాదు. అయితే నత్తి వల్లనే తనకు వివాహం కావంలేదని భావించి కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం అదే గ్రామంలోని కట్టమీద ఉన్న కల్లు గుడిసె వద్ద వాంతులు చేసుకుంటుండగా స్థానికులు గమనించారు. అతడి చెల్లికి అనూషకు, ఆమె భర్త అశోక్‌కు ఫోన్ చేసి చెప్పారు. పురుగుమందు తాగాడని భావించిన అనూష, అశోక్‌లు అతడి వెంటనే ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 8 గంటల సమయంలో మీరా చనిపోయాడు. మృతుడి చెల్లి అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలి'

మధిర, నవంబర్12: సీసీఐ అధికారులు పలు నిబంధనలు సడలించి పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండల రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు పాపినేని రామనర్సయ్య, మందా సైదులు, శీలం నరసింహారావు, తేలప్రోలు రాధాకృష్ణ, పల్లికంటి విల్సన్, వడ్రాణపు మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కోసూరి భవాని** W/o. రంగారావు, **వయస్సు** : 35సం॥లు, నివాసం: ఇ.నెం. 2-53/ఎ, అన్నారుగూడెం గ్రామము, తల్లాడ మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు